
సాక్షి
కాకినాడ
బుధవారం | 9 | ఆగస్టు | 2023



అన్నదాన భవనానికి విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో నిత్యాన్నదాన భవన నిర్మాణానికి కంచర్ల చినభద్రరావు, లక్ష్మి మాణిక్యాంబ దంపతులు మంగళవారం రూ 3,06,009 విరాళం అందించారు.



కాలువలకు నీరు

ధవళేశ్వరం:కాటన్ బ్యారేజ్ నుంచి మంగళవారం తూర్పు డెల్టాకు 4900, మధ్య డెల్టాకు 2600, పశ్చిమ డెల్టాకు 7500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

బాణసంచా గోడౌన్‌లో భారీ పేలుడు



అక్రమంగా నిర్వహిస్తున్న బాణసంచా గోడౌన్‌లో భారీ పేలుడు సంభవించిన ఘటనలో త్రుటిలో ప్రాణనష్టం, పెనుముప్పు తప్పాయి.

8లో

న్యూస్‌రీల్

ఈఏపీసెట్ షెడ్యూలులో స్వల్ప మార్పులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఇంజినీరింగ్,ఫార్మశీ కోర్సులలో ప్రవేశాలకు విడుదల చేసిన ఈఏపీ సెట్ షెడ్యూలులో స్వల్ప మార్పులు చేస్తూ సాంకేతిక విద్యాశాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.వెబ్ అప్షన్లకు ఆగస్టు 14వ తేదీ వరకూ అవకాశం కల్పించారు. అప్షన్ల మార్పునకు 16వ తేది కేటాయించగా 23న సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు. అడ్మిషన్ పొందిన అభ్యర్థులు ఆగస్టు 23 నుంచి 31వ తేదీలోగా సంబంధిత కళాశాలలో రిపోర్టు చేయాలన్నారు. ఆగస్టు 31వ తేది నుంచి తరగతులు ప్రారంభమవుతాయన్నారు. మారిన షెడ్యూల్ దృష్టిలో ఉంచుకుని అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యాశాఖ సూచించింది.

డయల్ యువర్ కలెక్టర్‌కు 13 కాల్స్

కాకినాడ సిటీ: డయల్ యువర్ కార్యక్రమంలో నమోదు అయిన సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం 10.30 గంటల నుంచి 11.30 గంటల వరకు కలెక్టర్ డయల్ యువర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. 13 మంది వివిధ సమస్యలపై టోల్‌ఫ్రీ నంబర్ 18004253077 నంబర్‌కు ఫోన్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ ప్రజల సమస్యల్ని నేరుగా తెలుసుకునేందుకు డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని ప్రతి మంగళవారం నిర్వహిస్తున్నామన్నారు. ఫోన్ ద్వారా తెలియజేసిన 13 మంది వ్యక్తుల సమస్యలను పరిష్కారం నిమిత్తం సంబంధిత శాఖల అధికారులకు పంపించడం జరిగిందన్నారు. డీఆర్వో కె శ్రీధర్‌రెడ్డి, కలెక్టరేట్ ఏవో జీఎస్ఎస్ శ్రీనివాస్, వివిధ సెక్షన్ల అధికారులు పాల్గొన్నారు.

రేపు హుండీ లెక్కింపు

అన్నవరం: అన్నవరం దేవస్థానంలో హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించనున్నారు. ఉదయం ఏడు గంటల నుంచి లెక్కింపు కొనసాగనుంది. గత జూన్ నెల 20 వ తేదీన హుండీలను తెరిచి భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారు. మరలా 50 రోజుల తరువాత లెక్కించనున్నారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో సిబ్బంది అందరూ పాల్గొనాలని దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ ఆదేశాలు జారీ చేశారు.

పాలవెల్లువపై ప్రత్యేక శ్రద్ధ

కాకినాడ సిటీ: జిల్లాలో లే అవుట్‌లలో పూర్తయిన ఇళ్లకు మంచినీటి కుళాయిలు, విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడంతో పాటు మరుగుదొడ్ల నిర్మాణం చేయాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వివిధ అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ సమీక్షించారు. కౌలు రైతులు సీసీఆర్సీ కార్డులు పంపిణీ వేగవంతం చేయాలన్నారు. జగనన్న పాలవెల్లువలో ఎక్కువ మంది రైతులు పాలు పోసే విధంగా అవగాహన కల్పించాలన్నారు. ప్రతి కేంద్రంలో రోజుకు కనీసం 150 లీటర్ల పాలు సేకరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాడి రైతులకు పశువులు కొనుగోలు చేసేందుకు రుణం మంజూరుకు రైతుల నుంచి దరఖాస్తులు తీసుకోవాలని ఆదేశించారు. జగనన్న పాలవెల్లువ పథకానికి సంబంధించి బీఎంసీయు యూనిట్ల గ్రౌండింగ్ చేపట్టాలని ఆదేశించారు. జేసీ ఇలక్కియ, అధికారులు పాల్గొన్నారు.

యువకుడి మృతి

శంఖవరం: ఎలక్ట్రికల్ పనులు చేస్తూ జీవిస్తున్న యువకుడి ప్రాణాలను అవే విద్యుత్ తీగలు బలిగొన్నాయి. అన్నవరం పోలీసుల కథనం ప్రకారం.. శంఖవరం మండలం పి.మల్లాపురానికి చెందిన వెన్ను నవీన్ క్రాంతికుమార్ (24) విద్యుత్ షాక్‌తో మంగళవారం మృతి చెందాడు. శృంగధార, పి.మల్లాపురం, సిద్ధివారిపాలెం తదితర గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. లైన్‌మన్ సెలవులో ఉండటంతో ప్రైవేటుగా విద్యుత్ పనులు చేస్తున్న నవీన్ విద్యుత్ వైర్లను పరిశీలించే సమయంలో ఈ ప్రమాదం జరిగింది. అతడికి తండ్రి చక్రం, తల్లి అమ్మాజీ ఉన్నారు. క్రాంతికుమార్ మృతితో వారు కన్నీరు మున్నీరుగా విలపించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు.

తొలిరోజు నాలుగు నామినేషన్లు

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): జిల్లాలో ఖాళీగా ఉన్న ఒక సర్పంచ్, 27 వార్డు సభ్యుల పదవులకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయగా మంగళవారం వార్డు సభ్యులకు 4 నామినేషన్లు దాఖలైనట్లు జిల్లా పంచాయతీ అధికారి విక్టర్ తెలిపారు. తాళ్లరేవు మండలం జార్జిపేట సర్పంచ్ పదవికి ఎవరూ నామినేషన్లు దాఖలు చేయలేదన్నారు. ఈ నెల 10న సాయంత్రం ఐదు గంటలు వరకూ నామినేషన్లు స్వీకరించనున్నట్టు తెలిపారు. 11న నామినేషన్ల పరిశీలన, 12న అభ్యంతరాల స్వీకరణ, 13న సక్రమంగాలేని నామినేషన్ల తిరస్కరణ , 14న ఉపసంహరణ ఉంటాయన్నారు. 19వ తేదీ ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ ఎన్నికలు ఉంటాయని, అదే రోజు మధ్యాహ్నం 2 గంటలు తర్వాత ఓట్ల లెక్కింపు, అనంతరం ఫలితాలు వెల్లడించనున్నట్టు తెలిపారు.



లంక గ్రామాల ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

భరోసా ఇస్తూ.. ధైర్యం చెబుతూ..

- వరద పీడిత ప్రాంతాల్లో సీఎం జగన్ సుదీర్ఘ పర్యటన
- సహాయ, పునరావాస చర్యలపై ఆరా
- బాధితులు, రైతులతో ముఖాముఖి
- నదీకోత పరిశీలన
- ఆదుకున్న తీరు భేష్ అన్న జనం

మామిడికుదురు/ముమ్మిడివరం: ధవళేశ్వరం బ్యారేజీ వద్ద గత నెలలో రెండో ప్రమాద హెచ్చరిక స్థాయిలో గోదావరి వెల్లువెత్తింది. పోటెత్తిన వరద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని లంక గ్రామాలపై ప్రభావం చూపింది. అటువంటి విపత్కర పరిస్థితుల్లో బాధిత ప్రజలను వరదకు వదిలేయకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తక్షణమే స్పందించారు. ముందుచూపుతో వ్యవహరించి, సహాయక చర్యలకు అవసరమైన నిధులు వెంటనే విడుదల చేశారు. యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. సహాయ, పునరావాస చర్యలు ప్రణాళికాబద్ధంగా చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. వరద తగ్గిన వెంటనే బాధితులకు అవసరమైన తక్షణ ఆర్థిక సహాయం, నిత్యావసర సరకులు అందజేసే ఏర్పాట్లు చేశారు. ఇవన్నీ పూర్తయిన తరువాత.. వీటి అమలు ఏవిధంగా ఉంది.. ఏవైనా లోటుపాట్లు ఉన్నాయా అనే విషయాలు బాధిత ప్రజలనే నేరుగా అడిగి తెలుసుకునే లక్ష్యంతో జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో సీఎం జగన్ మంగళవారం పర్యటించారు. అడుగడుగునా వరద బాధితులకు భరోసా ఇస్తూ.. వారిలో ధైర్యం నింపుతూ.. తనది ప్రజల ప్రభుత్వమని, మనందరి ప్రభుత్వమని చాటి చెప్పారు.

జనం కోసమే నా తపన

ముమ్మిడివరం మండలం గురజాపులంకలో ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్దకు ఉదయం 10.10 గంటలకు సీఎం జగన్ హెలికాప్టర్‌లో చేరుకున్నారు. సాయంత్రం 3.58 గంటలకు తిరుగుపయనమయ్యారు. సుమారు ఆరు గంటల పాటు జరిపిన తన పర్యటన సందర్భంగా ఆయన.. ముమ్మిడివరం, అయినవిల్లి మండలాల్లోని వరద ప్రభావిత గ్రామాల్లో పర్యటించారు. ముమ్మిడివరం మండలం గురజాపులంక, కూనాలంక, రామాలయం పేట, అయినవిల్లి మండలం కొండుకుదురులంకలోని తొత్తరమూడివారిపేటల్లో వరద బాధితులను పరామర్శించారు. అరటి, బెండ, కూరగాయల రైతులతో పాటు పాడి రైతులతో కూడా మాట్లాడారు.



పంటలకు వాటిల్లిన నష్టాలపై రైతులను అడిగి తెలుసుకుంటున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ముంపుతో దెబ్బ తిన్న పంటలను పరిశీలించారు. నెలాఖరుకు పరిహారం అందించి, ఆదుకుంటామని రైతులకు భరోసా ఇచ్చారు. కూనాలంక, తొత్తరమూడివారిపేటల్లో నదీపాతం అవుతున్న లంక భూముల్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పలుచోట్ల సీఎం జగన్‌తో ప్రజలు నేరుగా మాట్లాడుతూ, వరద సహాయక చర్యలు చక్కగా చేపట్టారని ఆనందం వ్యక్తం చేశారు. సీఎం జగన్ మాట్లాడుతూ, 'గోదావరి వరదలు, తుపానుల వంటి ప్రకృతి వైపరీత్యాలు వచ్చిన సమయంలో.. గత పాలకుల మాదిరిగా నేను ప్రచారం కోసం రాలేదు. నన్ను నమ్ముకున్న ప్రజల కోసమే నా తపన. వారిని ఆదుకోవడం కోసమే వచ్చాను. మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగేళ్ల పాలనకు, గత పాలకుల పాలనకు తేడాను గమనించండి' అని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

సహాయం అందించడం ఆనందంగా ఉంది

వైపరీత్యాల సమయంలో కలెక్టర్లను తక్షణం సన్నద్ధం చేసి, బాధితులకు బాసటగా నిలవాల్సిందిగా ఆదేశించామని సీఎం జగన్ చెప్పారు. ఒక్కో గ్రామానికి మండల స్థాయి అధికారులను ప్రత్యేకాధికారిగా నియమించి, వరద బాధితులకు వారం రోజుల్లో నిత్యావసరాలు, ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని ఆదేశించామని వివరించారు. 'వారం రోజుల్లో నేనే ప్రజల ముందుకు వస్తాను. ప్రభుత్వం బాగా పని చేసిందా.. ప్రభుత్వ వ్యవస్థ బాగా పని చేసిందా.. కలెక్టర్ బాగా పని చేశారా అని ప్రజల్నే ప్రశిస్తానని చెప్పా. ప్రతి అక్క, చెల్లెమ్మ, అన్న, తమ్ముడు ముఖాన చిరునవ్వే కనిపించింది. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సహాయం సక్రమంగానే అందిందని చెప్పడం చాలా ఆనందంగా అనిపించింది' అని సీఎం జగన్ చెప్పారు. కలెక్టర్ హిమాన్షు శుక్లా బాగా పని చేశారని ప్రతి ఒక్కరూ చెప్పడం సంతోషంగా ఉందని అన్నారు.

కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రులు జోగి రమేష్, తానేటి వనిత, పినిపే విశ్వరూప్, ఎంపీ చింతా అనురాధ, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్సీలు తోట త్రిమూర్తులు, బొమ్మి ఇజ్రాయిల్, కుడుపూడి సూర్యనారాయణ, ఎమ్మెల్యేలు పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, కొండేటి చిట్టిబాబు, రాపాక వరప్రసాదరావు, ఎస్పీ ఎస్.శ్రీధర్, జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నపూర్ అజయ్ కుమార్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

సీఎం టూర్ సాగిందిలా..

- ఉదయం 10.10: ముమ్మిడివరం మండలం గురజాపులంక హెలిపాడ్‌కు చేరిక.
- 10.20 – 11.10: వరద బాధితులకు, పంట నష్టపోయిన కూరగాయల రైతులకు పరామర్శ.
- 11.30 – 12.10: లంకాఫ్ ఠాణేలంక శివారు కూనాలంక చేరిక. నదీకోత పరిశీలన. వరద బాధితులనుద్దేశించి ప్రసంగం.
- మధ్యాహ్నం 12.15 – 1.20: అదే గ్రామ పరిధిలోని రామాలయంపేటకు చేరిక. వరద బాధితులకు పరామర్శ. బాధితులనుద్దేశించి ప్రసంగం.
- 2.00 – 2.56: అయినవిల్లి మండలం కొండుకుదురు పంచాయతీ తొత్తరమూడివారిపేటకు చేరిక. నదీపాతం పరిశీలన. వరద బాధితులకు పరామర్శ. రైతులతో ముఖాముఖి.
- 3.10 – 3.58: ముమ్మిడివరం మండలం గురజాపులంక హెలిపాడ్‌కు చేరిక. పార్టీ నేతలు, ప్రత్యేక అవసరాలు కలిగిన వారితో ముఖాముఖి. అనంతరం తాడేపల్లికి పయనం.

రైతుల హర్షం

వరదల వలన పంటలకు జరిగిన నష్టానికి ఈ నెలాఖరుకు పరిహారం చెల్లిస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. పంట నష్టపోయిన రైతులకు అన్యాయం జరిగితే 15 రోజుల్లో వారికి కూడా న్యాయం చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. గోదావరి నదీకోత నివారణకు రివిట్‌మెంట్ నిర్మిస్తామని, రైతుల కష్టాలు తీరుస్తామని భరోసా ఇచ్చారు. 'నేను మీ దగ్గరకు వచ్చాను. మీకు సమస్యలుంటే నా దృష్టికి తీసుకురండి. జిల్లా అధికారులంతా ఇక్కడే ఉన్నారు. నేను మీ సమస్యల పరిష్కారానికి బాధ్యత తీసుకుంటాను' అని సీఎం చెప్పారు. ప్రజలతో పాటు పశువులకు కూడా మేలు చేసిన పరిస్థితి జగనన్న ప్రభుత్వంలోనే ఉందని గర్వంగా చెబుతున్నానని జగన్ అన్నారు.

వేగంగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలి

లబ్ధిదారులతో జిల్లా కలెక్టరు

సామర్లకోట: స్థానిక ఈటీసీ జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టరు కృతికా శుక్లా ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయని లబ్ధిదారులతో మంగళవారం సామర్లకోట లేఅవుట్‌లో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. లబ్ధిదారులందరినీ పేరు పేరునా ప్రస్తావిస్తూ కలెక్టర్ మాట్లాడారు. ఇప్పటికే ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించి వివిధ దశల్లో ఉన్న వారు పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. వారికి కావలసిన సహాయ, సహకారం ప్రభుత్వ అధికారుల నుంచి లభిస్తుందని చెప్పారు. ఇప్పటి వరకు ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించని వారు థర్డ్ ఆప్షన్‌లో ఇళ్లు నిర్మించుకునేందుకు ముందుకు రావాలన్నారు. ఈ మేరకు లబ్ధిదారులు రూ.35 వేలు చెల్లిస్తే ఇల్లు నిర్మించి అప్పగిస్తామన్నారు. థర్డ్ ఆప్షన్ కింద ఇళ్ల నిర్మాణ నమూనా పరిశీలించాలని ఆమె సూచించారు. థర్డ్ ఆప్షన్‌కు సంబంధించి ఇప్పటికే కాంట్రాక్టరును నియమించామన్నారు. ఈ నెలాఖరులో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సామర్లకోటలోని జగనన్న కాలనీలో సామూహిక ఇళ్ల నిర్మాణాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారని ఆమె తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రతీ ఒక్కరూ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయడంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఆయా శాఖలకు చెందిన అధికారులు మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించాలన్నారు. జేసీ ఇలక్కియ, హౌసింగ్ పీడీ సుధాకర్ పట్నాయక్, డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి, మెప్మా పీడీ ప్రియంవద, డీఆర్‌డీఏ పీడీ కె శ్రీరమణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ సత్యనారాయణచౌదరి, ఆర్డీఓ ఎన్‌వీవీ సత్యనారాయణ, డీఎల్‌డీఓ నారాయణమూర్తి, మున్సిపల్ కమిషనర్ జె రామారావు తదితరులు పాల్గొన్నారు.



సమీక్షలో జిల్లా కలెక్టరు కృతికా శుక్లా, జేసీ ఇలక్కియ, దవులూరి దొరబాబులు

మద్యం లోడు లారీ బోల్తా

తుని రూరల్: మండలంలోని చేపూరు శివారు గవరయ్య కోనేరు వద్ద జాతీయ రహదారిపై మద్యం లోడుతో వెళ్తున్న లారీ బోల్తా పడింది. మంగళవారం రాత్రి ఈ ప్రమాదం జరిగింది. సామర్లకోట నుంచి తుని పట్టణానికి రూ.10 లక్షల విలువ చేసే మద్యాన్ని రవాణా చేస్తుండగా ఈ సంఘటన జరిగింది. మద్యం నేలపాలవడంతో సమీప గ్రామస్తులు మద్యం సీసాలు తీసుకునేందుకు ఎగబడ్డారు. సమాచారం అందడంతో రూరల్ సీఐ సన్యాసిరావు, ఎస్సై విజయకుమార్ తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని రక్షణ కల్పించారు. ధ్వంసమైన సీసాలను తొలగించి, ధ్వంసం కాని సీసాలను ఒబ్బిడి చేశారు. ఈ సంఘటనలో ఎవరికి ప్రమాదం జరగలేదు. పూర్తి స్థాయి నష్టం వివరాలు తెలియాల్సి ఉంది.



బోల్తా పడిన లారీ, రోడ్డుపై ధ్వంసమైన మద్యం సీసాలు

దక్షిణ భారత క్రికెట్ టోర్నీకి కాకినాడ లాయర్లు

కాకినాడ లీగల్: బెంగళూరులో ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకూ జరిగే దక్షిణ భారత న్యాయవాదుల నాలుగో క్రికెట్ టోర్నీలో పాల్గొనే రాష్ట్ర జట్టును ఆంధ్రప్రదేశ్ అడ్వొకేట్స్ క్రికెట్ అసోసియేషన్ ప్రకటించింది. ఈ జట్టుకు కాకినాడ బార్ అసోసియేషన్ చెందిన న్యాయవాదులు గింజల చక్రవర్తి, నక్క వెంకటేష్ ఎంపికయ్యారు. ఈ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన న్యాయవాదులు పాల్గొంటారు. రాష్ట్ర జట్టుకు ఎంపికైన న్యాయవాదులను బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ముత్తింటి విశ్వేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి చక్కా శ్రీనివాస్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కార్యదర్శి డి.అశోక్ అభినందించారు.

రత్నగిరిపై పెళ్లి సందడి

- రెండు నెలల విరామం తర్వాత హడావిడి
- ఏర్పాట్లు చేసుకుంటున్న పెళ్లి బృందాలు
- సింగిల్ విండో పద్ధతి ఈసారి లేనట్టే

అన్నవరం: రెండు నెలల తర్వాత రత్నగిరి సత్యదేవుని సన్నిధిలో ఈ నెల 20 నుంచి మరలా పెళ్లి బాజా మోగనుంది. వైశాఖం, జ్యేష్ఠ మాసాల సందర్భంగా గత మే, జూన్ నెలల్లో ఏకబిగిన సాగిన వివాహాలు తదితర శుభకార్యాలకు జూన్ 11న తాత్కాలికంగా తెర పడింది. జూన్ 19 నుంచి జూలై 17 వరకు ఆషాఢ మాసం, జూలై 18 నుంచి ఈనెల 16 వరకు అధిక శ్రావణ మాసం కారణంగా పెళ్లి ముహూర్తాలు లేవు. ఈ నెల 17 నుంచి నిజశ్రావణ మాసం ప్రారంభవుతోంది. దీంతో 20 నుంచి మరలా వివాహాలు జరుగతాయని పండితులు తెలిపారు.

సందడిగా మారిన దేవస్థానం

ఈ నెల 20 నుంచి పెళ్లి సందడి మొదలవుతుండడంతో పెళ్లిమండపాలు,సత్రం గదులు, పురోహితులు, సన్నాయి మేళం, కేటరింగ్ ఏర్పాట్ల కోసం పెళ్లిబృందాలు రత్నగిరికి వస్తున్నారు. దేవస్థానంలో పెళ్లిమండపాలు, గదులు రిజర్వేషన్ నెల రోజులు ముందుగా చేస్తారు. దీంతో గత నెల 20 నుంచి ఈ రిజర్వేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. ప్రధానంగా నిజ శ్రావణ మాసంలో గదుల కోసం పెద్ద ఎత్తున డిమాండ్ ఉంది. ప్రకాష్ సదన్ సత్రం మినహా మిగిలిన సత్రాలలో గదులు ఆన్‌లైన్‌లో రిజర్వ్ చేసుకునే అవకాశం కల్పించారు. ప్రొటోకాల్‌తో వచ్చే వీఐపీ గదుల కోసం ప్రముఖుల సిఫార్స్ లేఖలు వస్తుండడంతో అధికారులు తర్జన భర్జన పడుతున్నారు.

ఈ సారికి సింగిల్ విండో లేనట్టే....?

పెళ్లిళ్ల కోసం ఈఓ చంద్రశేఖర్ ఇటీవల ప్రతిపాదించిన సింగిల్ విండో పద్ధతి పూర్తిగా రూపు దిద్దుకోలేదు. సన్నాయి మేళానికి వేలం పాట నిర్వహించారు. ఇది ఏడాదికి రూ.2.16 కోట్లకు వెళ్లింది. పాటదారులు ఇంకా సొమ్ము చెల్లించలేదు. పురోహితుల వివాహ సంభావన హక్కు కోసం వేలం నిర్వహించే ప్రయత్నాలను పురోహిత, బ్రాహ్మణ సంఘాలు వ్యతిరేకించాయి. దీంతో ఆ ఆలోచనను దేవస్థానం విరమించుకుంది. పాత పద్ధతిలోనే వివాహాలు చేసుకోవచ్చునని పేర్కొంది.ఈసారి పాత పద్ధతిలోనే పెళ్లిబృందాలు ఏర్పాట్లు చేసుకుంటున్నాయి.

రూ. 40 కోట్లు ఆదాయం

దేవస్థానంలో భక్తుల రద్దీ పెరగడంతో ఆదాయం కూడా దండిగా సమకూరనుంది. భాద్రపద మాసం మినహాయిస్తే వచ్చే నిజశ్రావణం, ఆశ్వయుజ, కార్తిక మాసాల్లో సుమారు రూ.40 కోట్లు పైబడి ఆదాయం వచ్చే అవకాశం ఉంది. శ్రావణ మాసంలో సహజంగానే భక్తులు అధికంగా వస్తారు. వివాహాల సందడి కారణంగా భక్తుల సంఖ్య మరంత పెరగనుంది. నవదంపతుల వ్రతాలతో వ్రతమండపాలు కూడా సందడిగా మారనున్నాయి.



రత్నగిరి పై జరుగుతున్న వివాహాలు (ఫైల్)



సత్యదేవుని సన్నిధిలో నవదంపతుల సందడి



కొండ దిగువన గదులు రిజర్వ్ చేసే సీఆర్వో కార్యాలయం

ముహూర్తాలు

- ఈనెల 20 నుంచి సెప్టెంబర్ ఏడో తేదీ వరకు ముహూర్తాలున్నాయి
- భాద్రపదమాసంలో సెప్టెంబర్ 14 నుంచి అక్టోబర్ 13 వరకు ముహూర్తాలు లేవు.
- ఆశ్వయుజ మాసంలో అక్టోబర్ 15 నుంచి నవంబర్ 13 వరకు పెళ్లిళ్లు జరుగుతాయి,
- కార్తికమాసంలో నవంబర్ 14 నుంచి డిసెంబర్ 12 వరకు ముహూర్తాలున్నాయి.
- మార్గశిర మాసంలో డిసెంబర్ 13 నుంచి 2024 జనవరి 11 వరకు వివాహాలు జరుగనున్నాయి.
- పుష్యమాసంలో జనవరి 12 నుంచి ఫిబ్రవరి 9 వరకు పెళ్లిళ్ల ఊసు వినిపించదు.
- మాఘమాసంలో ఫిబ్రవరి 13 నుంచి మార్చి 10 వరకూ వివాహాలు జోరుగా జరుగుతాయి.

అంతర్జాతీయ ఫవర్ లిఫ్టింగ్‌లో స్వర్ణం



సామర్లకోటలో వీరబాబుకు స్వాగతం

సామర్లకోట: అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించిన క్రీడాకారుడికి సామర్లకోటలో మంగళవారం ఘన స్వాగతం లభించింది. ఈనెల 1 నుంచి 6వ తేదీ వరకు దుబాయిలో ఫవర్ లిఫ్టింగ్ పోటీలు జరిగాయి. జగ్గంపేటకు చెందిన బుర్ర శివ సాయి వీరబాబు 74 కేజీల విభాగంలో బంగారు పథకం సాధించాడు. మంగళవారం సామర్లకోట వచ్చిన వీరబాబుకు వ్యాయమ యువజన సంఘం ఆధ్వర్యంలో భారీ ఎత్తున బాణసంచా కాల్పులతో స్వాగతం పలికారు. వీరబాబు తండ్రి కన్నారావు సామర్లకోట వ్యాయమ కళాశాలలో శిక్షణ పొంది గతంలో వెయిట్ లిఫ్టింగ్‌లో అనేక బహుమతులు సాదించాడు. కన్నారావు జగ్గంపేటలో స్థిర పడ్డారు. ఇంజినీరింగ్ పూర్తి చేసి బుర్ర శివసాయివీరబాబును సామర్లకోటకు చెందిన వ్యాయమ కళాశాల ప్రతినిధులు వసంతల ప్రసాద్, కానూరి పవన్, కోశేశ్వరరావు, శ్యామ్, చంద్రశేఖర్, బాబి ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. సామర్లకోట నుంచి ర్యాలీగా జగ్గంపేట వెళ్లారు.


తలసేమియాతో బాధపడుతున్న గుబ్బాలయ్యకు సహాయం చేయాలని అభ్యర్థిస్తున్న కుటుంబ సభ్యులు


గుబ్బాలయ్య కుటుంబ సభ్యులకు రూ.లక్ష చెక్కు అందిస్తున్న కలెక్టర్ మాధవీలత. చిత్రంలో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

గోపాలపురం నియోజకవర్గంలోని భీమోలు గ్రామానికి చెందిన జి.నాగలక్ష్మి, భర్త రోజా కూలీతో జీవిస్తున్నారు. వారి ఐదేళ్ల కుమారుడు గుబ్బాలయ్య తలసేమియా వ్యాధితో బాధ పడుతున్నాడు. ఈ విషయాన్ని రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు సీఎం దృష్టికి తీసుకు వెళ్లారు. సీఎం ఆదేశాల మేరకు ఆ దంపతులకు కూడా కలెక్టర్ రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. గుబ్బాలయ్యకు మెరుగైన వైద్యం చేయిస్తామని భరోసా ఇచ్చారు.


లక్ష్మీ రేణుక చికిత్సకు సహాయం అందించాలని సీఎం జగన్‌ను అభ్యర్థిస్తున్న కుటుంబ సభ్యులు


లక్ష్మీ రేణుక వైద్యానికి రూ.లక్ష చెక్కు అందిస్తున్న కలెక్టర్ మాధవీలత

కొవ్వూరు మండలం సీతంపేటకు చెందిన నాగలక్ష్మి, గోవింద్ దంపతుల కుమార్తె లక్ష్మీ రేణుక ఊపిరితిత్తులకు సంబంధించిన బైలేటరల్ నోడ్యులర్ వ్యాధితో బాధ పడుతోంది. కుమార్తె వైద్య ఖర్చులు భరించే స్థితిలో లేమని, తమను ఆదుకోవాలని ఆ తల్లిదండ్రులు ముఖ్యమంత్రిని అభ్యర్థించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ దంపతులకు రూ.లక్ష తక్షణ ఆర్థిక సాయాన్ని కలెక్టర్ అందజేశారు. పాపకు మెరుగైన చికిత్స చేయిస్తామని తెలిపారు.


ఎస్‌కే షర్మిలతో మాట్లాడుతున్న సీఎం జగన్


షర్మిలకు రూ.లక్ష చెక్కు అందజేస్తున్న కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరానికి చెందిన ఎస్‌కే అబ్దుల్ షుకుర్ కుమార్తె షర్మిల (40) కీళ్లవాతంతో బాధ పడుతోంది. ఆమె వైద్య ఖర్చులు భరించే స్థితిలో తాము లేమంటూ ఆర్థిక సాయం కోసం సీఎంను షుకుర్ అభ్యర్థించారు. సీఎం జగన్ ఆదేశాల మేరకు బాధితులకు కేవలం రెండు గంటల వ్యవధిలోనే కలెక్టర్ రూ.లక్ష తక్షణ ఆర్థిక సాయం అందజేశారు.

పరిమళించిన మానవత్వం

- ఇద్దరు చిన్నారుల వైద్యానికి సీఎం జగన్ భరోసా
- హామీ ఇచ్చిన రెండు గంటల్లోనే కార్యరూపం
- ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున తక్షణ సాయం

రాజమహేంద్రవరం సిటీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి మానవత్వాన్ని చాటుకున్నారు. అనారోగ్యంతో బాధ పడుతున్న చిన్నారులను అక్కున చేర్చుకున్నారు. నేనున్నానంటూ ధైర్యం చెప్పారు. గోదావరి వరద ప్రభావిత ప్రాంతాల పర్యటనకు వచ్చిన ఆయన సోమవారం రాత్రి రాజమహేంద్రవరం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో బస చేసిన విషయం తెలిసిందే. మంగళవారం ఉదయం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాల సందర్శనకు బయలుదేరారు. ఈ రెండు సందర్భాల్లో ముగ్గురు బాధితులు తమ పిల్లలు వివిధ ఆరోగ్య సమస్యలతో సతమవుతున్నామని, తమకు ఆర్థిక సహాయం అందించాలని, ఆదుకోవాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని అభ్యర్థించారు. వారి ఆవేదన విని స్పందించిన సీఎం వెంటనే వారికి ఆర్థిక సహాయం అందించాలని, పిల్లల చికిత్సకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె.మాధవీలతకు అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఇద్దరికి 14 గంటలు, ఒకరికి రెండు గంటల వ్యవధిలో రూ.లక్ష చొప్పున తక్షణ ఆర్థిక సాయాన్ని కలెక్టర్ మాధవీలత అందించారు. దీనిపై బాధితుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. తమ పిల్లలకు తానున్నానంటూ గుండె ధైర్యం ఇచ్చిన సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

జాహ్నవి అభ్యర్థనకు సానుకూల స్పందన

అమెరికాలోని ఫ్లోరిడాలో కమర్షియల్ పైలట్ శిక్షణ పొందేందుకు ఆర్థిక సాయం చేయాలని పాలకొల్లుకు చెందిన దంగేటి జాహ్నవి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విజ్ఞప్తి చేసింది. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, కుటుంబ సభ్యులతో కలసి ఆమె రాజమహేంద్రవరంలో ముఖ్యమంత్రిని కలసి, ఈ మేరకు అభ్యర్థించింది. దీనికి సీఎం సానుకూలంగా స్పందించారు. గత ఏడాది జూలైలో రాజమహేంద్రవరం వచ్చిన సందర్భంగా కూడా జాహ్నవికి సీఎం జగన్ రూ.50 లక్షల సహాయం అందజేశారు. ఈ నేపథ్యంలో ఆ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపి, మరోసారి సహాయం అందించాలని కోరారు. జాహ్నవి ఇప్పటికే నాసా ఇంటర్నేషనల్ ఎయిర్ అండ్ స్పేస్ ప్రోగ్రామ్‌లో పాల్గొని చరిత్ర సృష్టించింది. జాహ్నవి వివరాలను సీఎం అడిగి తెలుసుకున్నారు. భారత సంతతికి చెందిన కల్పనా చావ్లా, సునీతా విలియమ్స్‌లా అంతరిక్షంలోకి అడుగుపెట్టాలన్నదే తన సంకల్పమని జాహ్నవి చెప్పింది. గతంలో సీఎం జగన్ చేసిన ఆర్థిక సాయంతో జాహ్నవి ఐఐఏఎస్ ఫ్లోరిడా, యూఎస్ఏ నుంచి సైంటిస్ట్ వ్యోమగామి అభ్యర్థిగా సిల్వర్ వింగ్స్ అందుకుందని మంత్రి వేణు సీఎంకు వివరించారు.


సీఎం జగన్‌ను కలిసిన పాలకొల్లుకు చెందిన జాహ్నవి. చిత్రంలో మంత్రి వేణుగోపాలకృష్ణ

క్లుప్తంగా

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

రాయవరం: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో ఉపకార వేతనాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని బ్రాహ్మణ సేవా ట్రస్ట్ చైర్మన్ దంతుర్తి సత్యప్రసాద్ తెలిపారు. మండలంలోని వెదురుపాకలో ఆయన మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియెట్, డిగ్రీ, తత్సమాన కోర్సులు చదువుతున్న విద్యార్థులు స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఆర్థికంగా వెనుకబడిన, మెరిట్ విద్యార్థులు స్కాలర్‌షిప్ పొందడానికి అర్హులన్నారు. అర్హతలు ఉన్న వారు ఈ నెల 20వ తేదీలోగా 98495 92523 నంబరుకు నేరుగా సంప్రదించాలని సత్యప్రసాద్ కోరారు.

కొనసాగుతున్న గాలింపు

రావులపాలెం: తల్లీబిడ్డలు సుహాసిని, జెర్సీల ఆచూకీ కోసం పోలీసులు మంగళవారం కూడా గాలింపు కొనసాగించారు. తనతో సహజీవనం చేస్తున్న తాడేపల్లికి చెందిన సుహాసినిని, తమ కుమార్తె జెర్సీని ప్రకాశం జిల్లా దర్శికి చెందిన ఉలవ సురేష్ రావులపాలెం బ్రిడ్జి పైనుంచి గౌతమీ గోదావరిలోకి తోసేసిన విషయం తెలిసిందే. ఆదివారం వేకువన ఈ దారుణం చోటు చేసుకోగా, మంగళవారం సాయంత్రం వరకూ ఆ తల్లీబిడ్డల ఆచూకీ తెలియరాలేదని ఎస్సై ఎం.వెంకటరమణ తెలిపారు. వారి కోసం రావులపాలెం గౌతమీ గోదావరి వంతెనల నుంచి ఆలమూరు, కపిలేశ్వరపురం, యానాం వరకూ గోదావరిలో పోలీసులు రెండు బోట్లపై గాలిస్తున్నారు.

భారీగా రేషన్ బియ్యం స్వాధీనం

రాజోలు/కొవ్వూరు/జగ్గంపేట: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పెద్ద మొత్తంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్, పౌరసరఫరాల అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. రాజోలు మండలం కడలి గ్రామంలో రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వ్యాన్‌ను సీజ్ చేశారు. 2 వేల మెట్రిక్ టన్నుల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. సఖినేటిపల్లి మండలం మోరిపోడు గ్రామానికి చెందిన దాట్ల నవీన్.. మామిడికుదురు మండలం అప్పనపల్లి, తాటిపాక గ్రామాలకు చెందిన పలువురు కార్డుదారుల నుంచి ఈ బియ్యం కొనుగోలు చేసి తరలిస్తున్నాడు.

ఈ వ్యాన్ అమలాపురానికి చెందిన బేనబోయిన శ్రీనుదిగా గుర్తించారు. సుమారు రూ.4.8 లక్షల విలువైన వ్యాన్, బియ్యం బస్తాలను సీజ్ చేశారు. యజమానిపై 6ఏ కేసు నమోదు చేశామని ఇన్‌చార్జి రీజినల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కె.కుమార్ తెలిపారు. తనిఖీల్లో డీఎస్పీ ముత్యాల నాయుడు, తహసీల్దార్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

- కొవ్వూరు మండలం వేములూరులోని ఒక ఇంట్లో 82 బస్తాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన 37.37 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులతో కలిసి స్వాధీనం చేసుకున్నామని పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్ జి.బాపిరాజు తెలిపారు. గ్రామానికి చెందిన ఔరంగబాద్ రేషన్ డీలర్ కొల్లేపర శ్రీనివాసమూర్తిపై 6ఏ కేసు నమోదు చేశామన్నారు. ఈ బియ్యాన్ని రేషన్ కార్డుదారుల నుంచి కిలో రూ.18 నుంచి రూ.21 చొప్పున కొనుగోలు చేశారన్నారు. వీటిని కోళ్ల ఫారాలు, ఇటుక బట్టీల్లో పని చేస్తున్న కార్మికులకు విక్రయిస్తున్నారని చెప్పారు. పట్టుబడిన బియ్యం విలువ రూ.1,54,480గా నిర్ధారించారు. ఔరంగబాద్‌లోని శ్రీనివాసమూర్తి చౌకదుకాణాన్ని కూడా తనిఖీ చేశామని బాపిరాజు తెలిపారు. దుకాణంలో స్టాక్, ఈ–పోస్ మెషీన్‌లోని వివరాలకు మధ్య వ్యత్యాసం ఉన్నట్టు గుర్తించామన్నారు. విజిలెన్స్ సీఐ రమేష్, వ్యవసాయ అధికారి భార్గవ మహేష్, హెడ్ కానిస్టేబుల్ జీవానందం తదితరులు పాల్గొన్నారు.
- జగ్గంపేట మండలం కాట్రావులపల్లి శివారు వెంగయ్యమ్మపేటలోని ఒక ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 11 బస్తాల రేషన్ బియ్యాన్ని పౌరసరఫరాల అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇంటి యజమాని చెట్టాడి తాతాజీని అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ బియ్యాన్ని కిలో రూ.16 చొప్పున కొనుగోలు చేసి, రూ.18కి కోళ్లఫారాలకు అమ్ముతున్నట్టు అతడు చెప్పాడు. అతడిపై 6ఏ కేసు నమోదు చేశారు. దాడుల్లో పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్ జి.మురళీకృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.


రాజోలులో రేషన్ బియ్యంతో వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ అధికారులు

బాణసంచా గోడౌన్‌లో భారీ పేలుడు

- చెలరేగిన మంటలు
- అదుపు చేసిన అగ్నిమాపక సిబ్బంది
- పక్కనే పెట్రోలు బంకు
- త్రుటిలో తప్పిన పెనుముప్పు.. ప్రాణనష్టం
- రూ.కోటి వరకూ ఆస్తినష్టం
- అక్రమంగా మందుగుండు నిల్వ
- ఇద్దరిపై కేసు

బిక్కవోలు: అక్రమంగా నిర్వహిస్తున్న బాణసంచా గోడౌన్‌లో భారీ పేలుడు సంభవించిన ఘటనలో త్రుటిలో ప్రాణనష్టం, పెనుముప్పు తప్పాయి. ప్రత్యక్ష సాక్షులు, పోలీసులు, అగ్నిమాపక అధికారుల కథనం ప్రకారం.. బిక్కవోలు మండలం తొస్సిపూడి గ్రామం మెయిన్ రోడ్డులో గాయత్రీ రైస్ మిల్లు, శ్రీరామకృష్ణారెడ్డి ఎంటర్‌ప్రైజెస్ ఇండియన్ ఆయిల్ పెట్రోలు బంక్ ఉన్నాయి. ఈ రెండింటికీ మధ్యన అదే గ్రామానికి చెందిన కొవ్వూరి వెంకటరెడ్డి స్థలం ఉంది. కొమరిపాలేనికి చెందిన కక్కల గోవిందు శ్రీ వెంకట దుర్గా ఫైర్ వర్క్స్ పేరుతో అనుమతులు తీసుకుని పందలపాక గ్రామంలో బాణసంచా వ్యాపారం చేస్తున్నాడు. అతడు తొస్సిపూడిలో కొవ్వూరి వెంకటరెడ్డికి చెందిన ఖాళీ స్థలాన్ని కూడా అద్దెకు తీసుకుని, ఎటువంటి అనుమతీ లేకుండా బాణసంచా గోడౌన్ నిర్వహిస్తున్నాడు. అందులో ముడిసరకు దాచి ఉంచుతున్నాడు. ఈ గోడౌన్ ఇక్కడ నిర్వహిస్తున్నట్టు ఎవ్వరికీ తెలియదని చెబుతున్నారు. మంగళవారం ఉదయం అందరూ ఎవరూ పనుల్లో వారు బిజీగా ఉన్నారు. ఆ సమయంలో ఒక్కసారిగా భారీ శబ్దం వచ్చింది. చుట్టుపక్కల ఉన్న బలభద్రపురం, పందలపాక, కొమరిపాలెం, కొంకుదురు గ్రామాల వరకూ పేలుడు శబ్దం వినిపించింది. దాని ప్రకంపనలు వ్యాపించాయి. దీనినిబట్టి విస్ఫోటం తీవ్రత ఎంతగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఒక్కసారిగా భారీ శబ్దం వినిపించడంతో చుట్టుపక్కల గ్రామస్తులు భయాందోళనతో పరుగులు తీశారు. రైస్‌మిల్లులో బాయిలర్ పేలిందని తొలుత అందరూ భావించారు. తీరా సంఘటన స్థలానికి చేరుకునేసరికి బాణసంచా గోడౌన్‌లో విస్ఫోటం సంభవించిందని వారికి అర్థమైంది. దీని తీవ్రతకు పక్కనే 50 మీటర్ల దూరంలో ఉన్న రైస్ మిల్లు క్వార్టర్ పై కప్పు బీటలు తీసింది. అందులో ఉంటున్న ఒడిశాకు చెందిన యాద్ విసారి గాయపడ్డాడు. అలాగే పేలుడు ధాటికి రాళ్లు ఎగిరి పక్కనే ఉన్న పొలంలో పని చేస్తున్న విస్సాకోటి ఆంజనేయులుకు తగిలాయి.

పేలుడుతో భయపడిన పెట్రోలు బంకు సిబ్బంది ప్రాణాలు అరచేత పట్టుకుని పరుగు తీశారు. ఈ క్రమంలో స్వల్పంగా గాయపడ్డారు. బంకులో జనరేటర్ కాలిపోయింది. అద్దాలు పగిలిపోయాయి. రైస్ మిల్లుకు కూడా నష్టం వాటిల్లింది. మంటలు చెలరేగడంతో రామచంద్రపురం నుంచి అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. మంటలను అదుపు చేశారు. జిల్లా అగ్నిమాపక అధికారి రూథర్‌కింగ్, అనపర్తి అగ్నిమాపక అధికారి శ్రీనివాసరెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. సుమారు రూ.కోటి వరకూ ఆస్తినష్టం జరిగి ఉంటుందని అంచనా వేశారు. ప్రమాద స్థలాన్ని సీఐ శ్రీనివాస్, ఎస్సై పి.బుజ్జిబాబు కూడా పరిశీలించారు. వీఆర్‌ఓ శ్రీదేవి ఫిర్యాదు మేరకు స్థలం యజమాని కొవ్వూరి వెంకటరెడ్డి, బాణసంచా గోడౌన్ అక్రమంగా నిర్వహిస్తున్న కక్కల గోవిందులపై కేసు నమోదు చేశారు. గోవిందు పరారీలో ఉన్నాడు. అతడి కోసం పోలీసులు గాలిస్తున్నారు.


మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది


పగిలిన పెట్రోలు బంకు అద్దాలు

నేనున్నానని..

ఈ నేలతల్లిని సస్యశ్యామలం చేస్తున్న తల్లి గోదావరే వెల్లువెత్తిన వేళ.. ఏరూ ఊరూ ఏకమై దిక్కుతోచని స్థితిలో ఉన్న బాధిత జనానికి.. ప్రభుత్వ పెద్దగా.. నేనున్నానంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నివిధాలా అండగా నిలిచారు. కేవలం ఆదేశాలిచ్చి వదిలేయకుండా.. ఆ ఆదేశాలు ఏవిధంగా అమలయ్యాయో.. ప్రభుత్వ యంత్రాంగం చేపట్టిన వరద సహాయక చర్యలు ఏవిధంగా అమలయ్యాయో పరిశీలించేందుకు మంగళవారం నేరుగా కోనసీమ గడ్డపై కాలు మోపారు. కష్టాల వేళ తమ కన్నీరు తుడిచి.. అన్నివిధాలా అండగా నిలిచిన తమ ప్రియతమ ముఖ్యమంత్రి జగన్‌కు ఇక్కడి ప్రజలు మనసారా స్వాగతం పలకగా.. వారికి ఆయన తన మాటలతో.. మడమ తిప్పని హామీలతో మరింత సాంత్వనను అందించారు.

– సాక్షి నెట్‌వర్క్


నదీకోతను ప్రత్యక్షంగా పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి


బాగా చదువుకుంటున్నారా అమ్మా.. : చిన్నారులకు సీఎం పలకరింపు


కష్టాల వేళ చాలా బాగా ఆదుకున్నారయ్యా..: మహిళ ఆనంద స్పందన


వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్న సీఎం జగన్. చిత్రంలో మంత్రులు విశ్వరూప్, వేణు, ఎమ్మెల్యేలు పొన్నాడ, చిట్టిబాబు తదితరులు


లంక గ్రామాల ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తున్న సీఎం జగన్. చిత్రంలో మంత్రులు జోగి రమేష్, విశ్వరూప్, వనిత, ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్యేలు పొన్నాడ, చిట్టిబాబు, కలెక్టర్ హిమాన్షు శుక్లా


చల్లగా ఉండయ్యా..: సీఎం జగన్‌కు వృద్ధురాలి దీవెన


మావయ్యతో ఓ సెల్ఫీ


వైద్య శిబిరంలో అందిస్తున్న సేవలు అడిగి తెలుసుకుంటూ..


వృద్ధురాలి సమస్యలు తెలుసుకుంటూ..